క్లుప్తంగా

పన్ను వసూళ్లపై శ్రద్ధ చూపాలి



డీపీఓకి స్వాగతం పలుకుతున్న అధికారులు

పెనుగొండ: పారిశుద్ధ్యం నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లపై శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి రామనాథ్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. సంపద కేంద్రాలు, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పన్ను వేయని ఇళ్లను గుర్తించి సకాలంలో పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.కృష్ణ మోహన్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేసిన ట్రస్ట్ సభ్యులు, పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అనాథ మృతదేహానికి అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదురుగా ఉన్న బస్టాండ్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వచ్చి స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు రాంబాబు, రాజేంద్రప్రసాద్, ట్రస్ట్ అధ్యక్షులు అంబటి సాయితేజ, సభ్యులు అనంతపల్లి సతీష్, గుబ్బల చరణ్, కొత్తపల్లి సాత్విక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం



మార్టేరులోని ఆచంట రోడ్డులో బస్సు కోసం వేసి ఉన్న ప్రయాణికులు

పెనుమంట్ర: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బుధవారం అన్ని రూట్లలోనూ బస్సులు నిండిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి బస్సులు సంఖ్య పెంచకపోవడం వల్ల ప్రయాణికుల చావుకు వచ్చిందని మహిళలు, వృద్ధులు కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. గురువారం అట్లతద్ది సందర్భంగా వివిధ సరుకులు కొనుగోలు చేయడానికి గ్రామీణ మహిళలు పట్నాలకు వెళ్లడం, తద్దులు తీర్చుకోవడానికి కోడళ్లు, బంధువులు పుట్టిళ్లకు ప్రయాణం కావడంతో బుధవారం బస్సుల్లో రద్దీ ఎక్కువైందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజం



స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి జిల్లా వ్యాధినిరోధక అధికారిణి దేవ సుధ.

ఆకివీడు: వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించాలని జిల్లా ఇమ్యూనిటీ వైద్యాధికారిణి దేవ సుధ చెప్పారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. చిన్న పిల్లలకు ఇస్తున్న 11 రకాల టీకాల గురించి స్థానిక వైద్యురాలు ఎండీ. నజీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 252 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో 11 రకాల టీకాల మందు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పుట్టిన శిశువు దగ్గర నుంచి ఐదేళ్ల వరకూ వేయాల్సిన టీకాలు సకాలంలో వేయడం ద్వారా పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో మజిల్స్(అమ్మోరు), రుబెల్లా వ్యాధుల్ని తుదిముట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే టీకాలు వేయడం ద్వారా వ్యాధి ఉధృతి తగ్గిందన్నారు. 10 నెలల లోపు పిల్లలకు ఒకసారి, 16 నెలల లోపు పిల్లలకు ఒక సారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఏడాదిన్నరలో రెండు టీకాలు వేయించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. సర్వైకల్ క్యాన్సర్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ ఉందని, అయితే ప్రభుత్వ సరఫరా లేదని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు.

వినోదపు పన్ను వసూలు నామమాత్రమే!

- ఆదాయం పెంపులో మునిసిపాలిటీ విఫలం
- పట్టించుకోని గత పాలకవర్గం



నరసాపురం మునిసిపల్ కార్యాలయం

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీ నష్టపోతుంది. ఈ పన్నులు ద్వారా ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతున్నాయి. ప్రజల నుంచి వచ్చే ఆస్తి, కుళాయి పన్నుల విషయంలో అత్యంత చురుగ్గా వ్యవహరించే మునిసిపల్ అధికారులు వినోదపు పన్నుల విషయంలో ఎందుకు శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ.4 లక్షలు, ప్రకటనల ద్వారా రూ.1.23 లక్షలు మొత్తంగా రూ.5.23 లక్షలు పన్నులు వస్తున్నాయి. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ.2.75 కోట్లు ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా అత్యంత నామమాత్రంగా ఉంది.

పేరుకుపోయిన బకాయిలు

వినోదం, ప్రకటన పన్నుల వసూళ్లు కనీసంగా కూడా రాకపోయినా గత పాలకవర్గం అసలు పట్టించుకోలేదు. దీంతో మునిసిపాలిటీకి భారీగా ఆదాయం తగ్గిపోయింది. అలాగే వసూలు కావాల్సిన పన్నులు కూడా ఏళ్ల తరబడి మొండి బకాయిలు మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం మునిసిపాలిటీకి వినోదం పన్నులు రూ.10 లక్షల వరకు, ప్రకటనల పన్నులు రూ.3 లక్షల వరకు బకాయిలున్నాయి. వినోదం పన్నులకు సంబంధించి కేవలం సినిమా థియేటర్లపైనే పడుతున్నారు. రాజకీయ అండదండలు ఉండటంతో కేబుల్ నిర్వాహకులకు జోలికి వెళ్లడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇతర అంశాల నుంచి రూ.లక్షల్లో పన్నులు వచ్చే అవకాశం ఉన్నా వారి నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలను పట్టించుకోవడంలేదనే చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కడికక్కడ ప్రకటనల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడంలేదు. ఆదాయం వచ్చే మార్గాల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తూ మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆదాయం పెంచుకోవాలి



స్థానిక సంస్థలు ఆదాయ మార్గాలు పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి. అందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. కేవలం ఆస్తి, కుళాయి పన్నులపైనే కాకుండా ఇతర రూపాల్లో ఆదాయం సమకూరేలా చూసుకోవాలి. వినోదం, ప్రకటనల పన్నులు నామమాత్రంగా వసూలు కావడం దారుణం.

– కడలి పెద్దిరాజు, నరసాపురం

మావుళ్లమ్మవారి సేవలో మాజీ మంత్రి రోజా



మావుళ్లమ్మ సన్నిధిలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కల్యాణి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో మావుళ్లమ్మను మాజీ మంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కల్యాణిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, శ్రీ అమ్మవారి చిత్రపటం అందజేశారు.

కళాశాల స్వర్ణోత్సవ లోగో విడుదల

పాలకొల్లు సెంట్రల్: అనేక మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లిన కళామతల్లి స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద శోభాయాత్రలో భాగంగా సర్వర్ణోత్సవ వేడుకల లోగోను ఆయన విడుదల చేశారు. 50 సంవత్సరాల పాటు దిగ్విజయంగా అతి తక్కువ ఫీజులతో చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీని నడిపించడం హర్షనీయమని అన్నారు. అనంతరం గాంధీబొమ్మల సెంటర్ నుంచి యడ్లబజారు సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు, కనుమూరి సీతారామ రాజు, దేవరపు లక్ష్మీనారాయణ, రేపాక ప్రవీణ్ భాను, కొమ్ముల మురళి, కఠారి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న చాంబర్స్ కళాశాల విద్యార్థులు



చికిత్స పొందుతున్న విద్యార్థిని సాయిలక్ష్మి

విద్యార్థినికి గాయాలు

పట్టణంలో శోభాయాత్ర పూర్తయిన అనంతరం విద్యార్థులను తమ బస్సుల్లో కళాశాలకు తీసుకువెళుతుండగా డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో జూనియర్ ఇంటర్ విద్యార్థిని నల్లా లీలా సాయి లక్ష్మి ముందుకు పడిపోయింది. ఆమె తలకు, చేతికి అద్దం తగిలి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తం కారుతుండడంతో ద్విచక్ర వాహనంపై పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని సాయిలక్ష్మికి చికిత్స చేసి రాత్రికి ఇంటికి పంపించామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సుల్లో విద్యార్థినుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: ఏదైనా ఒక వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఆ వస్తువు ఎలా తయారైందో కూడా తెలుసుకోవాలని గోదావరి జిల్లా రోటరీ క్లబ్ అధ్యక్షులు పులకండం కీర్తిచంద్ రాయుడు అన్నారు. బుధవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్ హాన్స్‌డ్ లెర్నింగ్ అనే జాతీయ స్థాయి ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన కళాశాల విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా కీర్తిచందు కళాశాల విద్యార్థినులు లద్దిక రమ్య తేజశ్రీ, లక్కోజు గాయత్రిలను అభినందిస్తూ వారికి రూ.వెయ్యి చొప్పున బహుమతి అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కీర్తిచంద్, శోభారాణిలు

సాగులో ఆదాయం పెంచుకోవాలి

పెనుగొండ: సాగులో రైతన్నలకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు చేస్తున్నటుట్లు మార్టేరు వరి పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ రమణ అన్నారు. బుధవారం ఐఎఫ్‌సీ క్లస్టర్ సిద్ధాంతం, నడిపూడి, రామన్నపాలెంలకు చెందిన మహిళా రైతులకు అవగాహన సదస్సు రామన్నపాలెంలో నిర్వహించారు. వ్యవసాయ యాంత్రీకరణ, అనుబంధ ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చునని, పంటల సస్యరక్షణకు అవసరమైన మందులు వాడాలని రమణ సూచించారు. పంటలకు నష్టం కలిగించే ఎలుకల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళా రైతుల ఆర్థిక బలోపేతానికి ప్రతి 100 కుటుంబాలకు సీఆర్‌పీలను నియమించి, వారివారి అభీష్టం మేరకు వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్స్ విషయాలపై అధునాతన టెక్నాలజీ అందించడమే ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, ఎంపీటీసీ కృష్ణకాంత్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ సభ్యుడు సుబ్బరాజు, గంధ్రోతు నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్, శాస్త్రవేత్తలు డాక్టర్ నామాల శ్రీనివాస్, డాక్టర్ భువనేశ్వరి, ఏఓ పి స్పందన, కుసుమకుమారి, పుష్పావతి, పార్వతిలు పాల్గొన్నారు.



రామన్నపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త రమణ

రోబోటిక్ సర్జరీలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: నేడు ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని డాక్టర్ నితిన్ రిమ్మలపూడి అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో రాజమండ్రి డెల్టా హాస్పటల్ ఆధ్వర్యంలో అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీపై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డాక్టర్ నితిన్ మాట్లాడారు. అడ్వాన్స్ రోబోటిక్ సర్జరీ ద్వారా హెర్నియా, గర్భాశయ, బీరయార్ట్రిక్, గాలిబ్లాడర్ మేజర్ ఆపరేషన్లు అతి తక్కువ నొప్పితో, అతి తక్కువ ఖర్చుతో చేయవచ్చని వివరించారు. షుగర్ వ్యాధికి శాశ్వత ఆపరేషనలు, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్స్ మండవ సుమంత్, ఆర్ క్రాంతి కుమార్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



అడ్వాన్స్ వైద్య టెక్నాలజీని వివరిస్తున్న వైద్యులు

కేదారీఘాట్‌లో ఆలయాల పరిశీలన

పెనుగొండ: వశిష్టా గోదావరి పరివాహక ప్రాంతం సిద్ధాంతం కేదారీఘాట్‌లో రాబోయే పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లుపై దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ డీఎల్వీ రమేష్ బాబు బుధవారం పరిశీలించారు. ఆలయాల సుందరీకరణ, పుష్కరాలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, ఇతర అంశాలపై స్థానికులతో చర్చించారు. ఆలయాలు ఎత్తు పెంచాలని, సత్రం చుట్టూ ప్రహరీ నిర్మించాలని స్థానికులు సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, డీఈఓ హరి సూర్యప్రకాష్, బొబ్బిలి శ్రీను, కట్టా చిన శ్రీను, కడలి సత్యనారాయణ, కౌరు శ్రీరామమూర్తి, చింతపల్లి జేమ్స్, లక్కువర్మ, తానేటి మదన్, బడేటి గణేష్, కుక్కల రామకృష్ణ, ఊటాల మురళి పాల్గొన్నారు.



కేదారీ ఘాట్‌లో ఆలయాలను పరిశీలిస్తున్న డెప్యూటీ కమిషనర్ రమేష్ బాబు

సీజేఐపై దాడి యత్నం హేయం

భీమవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం హేయమైన చర్యని, దీనికి బాధ్యుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ బుధవారం సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసీపీఐయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భీమవరం పాత బస్‌స్టాండ్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. భీమారావు మాట్లాడుతూ చెప్పులతో, బూట్లుతో నిమ్న వర్గాలను అవమానించడం సనాతన ధర్మంలో నిత్యకృత్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ సీజెఐపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, పాలకులు ప్రేరణతోనే ఇది జరిగిందని ధ్వజమెత్తారు. ఎంసీపీఐయు జిల్లా నాయకుడు కె.మహంకాళి, ఫార్వార్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ సీజెఐపై నిస్సిగ్గుగా దాడి జరగడం శోచనీయమన్నారు. నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వైవీ ఆనంద్ పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలుపుతున్న నాయకులు

యోగాతో మానసిక ప్రశాంతత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని లయన్స్ కరిబండి రామకృష్ణ అన్నారు. అలాగే నడక, వ్యాయామలు తప్పనిసరి చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు సహకారంతో బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. లయన్స్ ఇంద్రవాణి అధ్యక్షత వహించారు. విద్యార్థులచే ధ్యానం చేయించారు. యోగాసనాలు వేయించారు. వక్తలు మాట్లాడుతూ కౌమరదశలో వచ్చే మార్పులు, మానసిక ఆరోగ్యం, చదువులు, భవిష్యత్తు కోసం ముందుస్తుగా పునాది, భాగోద్వేగాలు అర్థం చేసుకోవడం తదితర విషయాలపై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో కె.రామకృష్ణ, శశికళ, రత్నకుమారి, కృష్ణంరాజు, మాధవి, కారుణ్య సరస్వతి, కొత్త సుభద్ర, మాధురి, ఉమా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరిబండి రామకృష్ణ

గర్భిణులకు సీమంతాలు



గర్భిణులకు పండ్లు ఇస్తున్న డాక్టర్ ఆనంద్, తదితరులు

తణుకు అర్బన్: మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్‌పై పైడిపర్రులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు మానసిక వైద్యులు డాక్టర్ కుదారి ఆనంద్ అవగాహన కల్పించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్ డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ వంక రాజకుమారి సౌజన్యంతో 30 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీడీపీవో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, మాజీ గవర్నరర్ మాదిరెడ్డి బాబూజీరావు, ఫ్యామిలీ కౌన్సెలర్ కుదారి సజిని, డాక్టర్ వసుంధర, జవ్వాది తమ్మయ్య నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం

రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్ని జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలవలను తలపించాయి. ఉదయం నుంచి తీవ్ర ఎండ కాచి సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులపై మోకాళ్ల లోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పట్టారు. గ్రామంలో పల్లపు వీధి కాలువను తలపించింది. స్థానికులు బయటికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీటిలో వాహనదారులకు ఇక్కట్లు



కాళ్లలో కాలువను తలపిస్తున్న పల్లపువీధి

దురదృష్టకరం

పెనుగొండ: వారం రోజుల వ్యవధిలోనే నక్కా సోదరులు ఇద్దరు మృతి చెందడం దురదృష్టకరమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుగొండ సొసైటీ చైర్మన్ నక్కా వేద వ్యాస శాస్త్రి సోదరులు బాలాజీ, మురళీల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వారి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: వాట్సాప్ షెడ్యూల్ ద్వారా రైతులు నేరుగా ఎన్ని బస్తాలు అమ్ముకోవాలనుకుంటున్నారో అన్ని బస్తాలనే షెడ్యూల్ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం పోడూరు మండలంలో వాస్తా, డీఏ, కస్టోడియన్ ఆఫీసర్, సొసైటీస్ సిబ్బందికి ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యం ధర క్వింటాల్ సాధారణ రకానికి రూ.2369, గ్రేడ్ ఏ రకానికి రూ.2389 నిర్ధారించారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఎం విశ్వాసరావు, ఎంఎల్‌వో బీవీ శేషుబాబు, డీటీ కేవీవీ సత్యనారాయణ, ఆర్టై రంబాబు, ఏఈఓ వి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యకర సమాజం

వీరవాసరం: నడకతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య సలహాదారు నవీన్ కుమార్ తెలిపారు. బుధవారం కొణితివాడ జెడ్పీ హై స్కూల్‌లో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నవీన్‌కుమార్ మాట్లాడుతూ మనసు ఆరోగ్యంగా ఉంటే జీవితం సాఫీగా సాగుతుందని తెలిపారు. ఇటీవలి కాలంలో ఒత్తిడి, నిరాశ, ఆందోళన వంటి సమస్యలు చిన్న వయసులోనే పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి రోజువారీ జీవనశైలిలో చిన్న మార్పులు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రతిరోజూ తగినంత నిద్ర (7–8 గంటలు) తీసుకోవడం మనసు ప్రశాంతంగా ఉండేందుకు అత్యవసరమన్నారు. వ్యాయామం మన శరీరానికి మాత్రమే కాదు, మనసుకు కూడా శక్తినిస్తుంది. హెచ్‌ఎం మండా రామ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

ఉండి: మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే 45 రోజుల ఉచిత కంప్యూటర్ కోర్సు(ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్) కొరకు ఆశక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ డీ ఆనంద్‌వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆశక్తి గల మహిళలు 10వ తరగతి పాస్ అయిన వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫోటో, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీతో ఐటీఐకి నేరుగా వచ్చి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయించుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు 9492885556 నంబర్లో ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని తెలిపారు. మహిళలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహానాగు చిత్రం షూటింగ్ ప్రారంభం

పెంటపాడు: దైనందిన జీవితంలో దైవభక్తి ప్రాశస్త్యాన్ని వివరించే మహానాగు చిత్రం షూటింగ్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో నూతన చిత్రమైన మహానాగు చిత్రం షూటింగ్ ప్రారంబోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహూర్తం క్లాప్ కొట్టి ఎమ్మెల్యే చిత్రయూనిట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తొలుత ఉమారామలింగేశ్వరస్వామి, శ్రీకృష్ణాశ్రమం తదితర ప్రాంతాలలో షూటింగ్ కోసం యూనిట్ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు.